సాక్షి ఖమ్మం

మంగళవారం । 11 । జూన్ । 2024



సరికొత్తగా ఖమ్మం మార్కెట్

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించడంతో కొత్త రూపురేఖలు సంతరించుకోనున్నాయి. 10లో



వైద్యరంగంలో పురోగతి

తెలంగాణ ఏర్పాటయ్యాక పదేళ్లలో పరిశీలిస్తే జిల్లా వైద్యరంగంలో అనేక మార్పులు రాగా.. వైద్యసేవలు మెరుగుపడ్డాయి. 8లో

గరిష్టం / కనిష్టం

38° / 27°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఉష్ణోగ్రత సాధారణ స్థాయిలోనే నమోదవుతోంది. ఎక్కువ ప్రాంతాల్లో చల్లగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

ధరణి ఫైళ్ల పరిష్కారంలో వేగం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్ నుంచి సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రెవెన్యూ అధికారులతో ధరణి దరఖాస్తులు, పెండింగ్ రిజిస్ట్రేషన్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ధరణి దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని.. ఆపై ఆర్డీఓ, అక్కడి నుంచి అదనపు కలెక్టర్‌కు చేరితే పరిష్కారం పూర్తవువుతుందని తెలిపారు.

పీఏసీఎస్‌లకు పచ్చిరొట్ట, అపరాల విత్తనాలు

- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో రైతుల ఫిర్యాదుతో స్పందన

ఖమ్మంవ్యవసాయం: వానాకాలం పంటల సాగుపై సూచనలు ఇచ్చేందుకు ఇటీవల 'సాక్షి' ఆధ్వర్యాన నిర్వహించిన ఫోన్ ఇన్‌లో పలువురు రైతులు పచ్చిరొట్ట, అపరాల విత్తనాలు లభించడం లేదని ఫిర్యాదు చేశారు. వైరా మండలం సిరిపురానికి చెందిన రైతు ఐనాల కనకరత్నం సహా వివిధ మండలాల రైతులు ఈ సమస్యను వివరించారు. దీంతో ఫోన్ ఇన్‌లో పాల్గొన్న జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల చేసిన సూచనలతో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఖమ్మం యూనిట్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టారు. రైతులు కోరిన ప్రాంతాల్లో పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగు, పిల్లి పెసర వంటి విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. అలాగే, పెసర, కంది విత్తనాలను కూడా సమకూర్చడం మొదలుపెట్టారు. ఇదేసమయాన వరిలో బీపీటీ 5204 వరి రకం, ఆర్‌ఎన్‌ఆర్ రకాలను కూడా సహకార సంఘాల ద్వారా అమ్మకానికి రంగం సిద్ధం చేశారు.

ప్రారంభమైన ఈ సెట్ కౌన్సెలింగ్



విద్యార్థికి ధ్రువపత్రం అందజేస్తున్న కోఆర్డినేటర్

ఖమ్మం సహకారనగర్: ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు కల్పించేందుకు చేపట్టిన ఈ సెట్ కౌన్సెలింగ్ ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలలో సోమవారం ప్రారంభమైంది. ఈనెల 12వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలించనుండగా, 14వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. ఆతర్వాత 18న మొదటి విడత సీట్ల కేటాయింపు, 21వ తేదీన సెల్ఫ్ రిపోర్టింగ్ ఉంటుందని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా, కౌపన్సెలింగ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం తెలిపారు. కాగా, సోమవారం స్లాట్ బుక్ చేసుకున్న 249మంది విద్యార్థుల్లో 235మంది హాజరయ్యారని వెల్లడించారు. ఇక జూలై 15నుంచి 17వ తేదీ వరకు రెండో విడత కౌన్సిలింగ్ ఉంటుందని తెలిపారు.

ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

- పదోన్నతుల్లో అక్రమాలపై చర్యలు

ఖమ్మంవైద్యవిభాగం: జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి(డీసీహెచ్ఎస్) కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు పడింది. ఈసందర్భంగా వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ జె.అజయ్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్యాలయంలోని రికార్డ్ అసిస్టెంట్, ఇతర ఉద్యోగులు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందే సమయాన నకిలీ ధృవపత్రాలు సమర్పించినట్లు ఇటీవల గుర్తించారు. అయితే, ఈ వ్యవహారంలో అసిస్టెంట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ ఎస్.జ్యోతిపాత్ర ఉన్నట్లు విచారణలో తేలడంతో సస్పెండ్ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అభ్యంతరాల స్వీకరణ

ఖమ్మం సహకారనగర్: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి పండిట్, పీఈటీల అప్‌గ్రేడేషన్‌కు సర్టిఫికెట్ల పరిశీలన ఆదివారంతో ముగిసింది. ఈమేరకు ఆయా దరఖాస్తులపై సోమవారం డీఈఓ కార్యాలయ ఉద్యోగులు విచారణ చేపట్టారు. ఇదిలా ఉండగా అభ్యంతరాలు సమర్పించేందుకు రూపొందించిన వెబ్‌సైట్ మొరాయిస్తున్నట్లు సమాచారం. అయితే, అభ్యంతరాల స్వీకరణ మంగళవారం కూడా కొనసాగనుండడంతో సాయంత్రానికి స్పష్టత రానుంది.

బదిలీల జోష్..

ట్రాన్స్‌ఫర్లు, పదోన్నతులపై ప్రభుత్వం దృష్టి

- దీర్ఘకాలంగా ఒకేచోట ఉన్న ఉద్యోగులకు స్థానచలనం
- ఇప్పటికే మొదలైన ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ
- ఇతర శాఖల్లో ఇన్‌చార్జి అధికారులతోనే పాలన
- పదోన్నతులతో ఆయా పోస్టులు భర్తీ అయ్యే అవకాశం



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: జిల్లాలో ఉపాధ్యాయులు, ఇతర శాఖల ఉద్యోగుల బదిలీలు, పదోన్నతుల సందడి నెలకొంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగియడంతో ప్రభుత్వం ఈ అంశంపై దృషిసారించింది. దీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తున్న ఉద్యోగులకు స్థానచలనం కల్పించేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల కాగా సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. మరోవైపు జిల్లాలోని వివిధ కీలక శాఖల్లో కీలక అధికారులుగా ఇన్‌చార్జ్‌లే ఉన్నారు. ప్రస్తుతం కల్పించనున్న పదోన్నతులతో ఈ ఖాళీలు కూడా భర్తీ అయి పూర్తిస్థాయిలో అధికా రుల నియామకం జరుగుతుందని భావిస్తున్నారు.

ఉపాధ్యాయుల్లో హుషారు

అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతి కల్పించి బదిలీ చేసేందుకు గత ప్రభుత్వ హయాంలోనే ప్రక్రియ ప్రారంభించినా, న్యాయ సంబంధ వివాదాలతో ముందుకు సాగలేదు. ఇప్పుడు ఎన్నికలు ముగిశాక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో షెడ్యూల్ విడుదలైంది. గతంలో ఎక్కడైతే ప్రక్రియ నిలిచిపోయిందో.. అక్కడి నుంచే మళ్లీ మొదలుపెట్టారు. ప్రస్తుతం ఉపాధ్యాయుల ఎస్‌ఆర్(సర్వీస్ రిజిస్టర్) పరిశీలన జరుగుతోంది. అలాగే జిల్లాలో అప్‌గ్రేడ్ అయిన పోస్టుల వివరాలను పాఠశాలల వారీగా కేటాయించి సీనియారిటీ జాబితా సిద్ధం చేశారు. జాబితాలో అభ్యంతరాలను ఆన్‌లైన్ ద్వారా సేకరిస్తున్నారు. వీటిని ఈనెల 12లోగా పరిష్కరించనుండగా.. 13వ తేదీ నుంచి ఆప్షన్ల ఎంపిక ఉంటుంది.

ఇతర శాఖల్లోనూ...

ఉపాధ్యాయులతోపాటు ఇతర శాఖల ఉద్యోగుల బదిలీలకు సైతం ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. దీంతో దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేసిన ఉద్యోగులకు స్థానచలనం కలగనుంది. ఇప్పటికే కొందరు పోలీస్ అధికారుల బదిలీలు జరగ్గా.. ఇంకొందరికి కూడా అవకాశముంది. మూడు నుంచి ఐదేళ్ల వరకు ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు ఈ దఫా బదిలీలు జరగనున్నాయి.

ఇన్‌చార్జిలతోనే నిర్వహణ

జిల్లాలోని పలు కీలక శాఖల్లో ఇన్‌చార్జిలే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో పనులు నత్తనడకన సాగడంతో పాటు పాలన కుంటుపడుతోంది. కొందరు ఇతర జిల్లాలకు చెందిన అధికారులు ఇన్‌చార్జిలుగా ఉండటం.. అప్పుడప్పుడు మాత్రమే వస్తుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. పౌర సరఫరాల శాఖ, జలవనరుల శాఖ, వైద్యశాఖ, మార్కెటింగ్, దేవాదాయ, పశుసంవర్ధక శాఖల్లో అధికారులుగా ఇన్‌చార్జిలే ఉన్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం పదోన్నతులకు అవకాశం కల్పించిన నేపథ్యాన ఈ కీలక శాఖలు భర్తీ అయ్యే అవకాశం ఉంది.

ఇన్‌చార్జ్‌లు, దీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారులు...

- ఏఎస్‌ఓ అయిన కె.చందన్‌కుమార్ పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో డీసీఎస్‌ఓగా జనవరి నుంచి విధులు నిర్వర్తిస్తున్నారు.
- పౌర సరఫరాల సంస్థ డీఎంగా జి.శ్రీలత డిప్యూటేషన్‌పై గత ఏడాది ఆగస్టు 21 నుంచి పనిచేస్తున్నారు.
- డైట్ లెక్చరర్ అయిన సోమశేఖరశర్మ డీఈఓగా డిప్యూటేషన్‌పై 2023 ఫిబ్రవరి 19 నుంచి ఉన్నారు.
- హైదరాబాద్‌లో ఐడీసీఎండీగా పోస్టింగ్ ఉన్న విద్యాసాగర్‌రావు జల వనరుల శాఖ జిల్లా సీఈగా ఐదు నెలలుగా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.
- రెవెన్యూశాఖలో తహసీల్దార్ అయిన టి.సునీల్‌కుమార్‌రెడ్డి డీఎస్‌ఓగా గత ఏడాది మార్చి నుంచి డిప్యూటేషన్‌పై కొనసాగుతున్నారు.
- డీఎంహెచ్‌వో మాలతి ఇన్‌చార్జిగా 2019 డిసెంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు.
- జిల్లా ఫైర్ ఆఫీసర్ జయప్రకాష్ 2012 నుంచి ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు.
- జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ.అలీం ఎనిమిది నెలలుగా ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు.
- జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయస్వామి రెండేళ్ల నుంచి ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.
- ఉమ్మడి జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పోస్టులో నాలుగేళ్లుగా ఇన్‌చార్జ్‌గా అధికారులే ఉన్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఏసీగా సులోచన ఏడాదిన్నర నుంచి ఉన్నారు.
- జిల్లా సహకార అధికారి మురళీధర్‌రావు సెలవులో వెళ్లడంతో భద్రాద్రి జిల్లా అధికారి ఖుర్షీద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.
- జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణుమనోహర్‌రావు సెలవుపై వెళ్లడంతో హన్మకొండ అధికారి నారాయణకు అదనపు బాధ్యతలు కేటాయించారు.
- ఫుడ్ సేఫ్టీ శాఖలో ఉమ్మడి జిల్లాకు అసిస్టెంట్ కమిషనర్‌ను ఇప్పటివరకు నియమించలేదు. జిల్లా గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఐదేళ్లుగా ఇక్కడే పనిచేస్తున్నారు. ఆ శాఖలో మరో రెండు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు సైతం ఖాళీగా ఉన్నాయి.

ఫిర్యాదులు పరిష్కరించండి

అదనపు కలెక్టర్ సత్యప్రసాద్



ఫిర్యాదులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందిస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి(గ్రీవెన్స్ డే)లో భాగంగా ఆయన మరో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌తో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. అయితే, ఎన్నికల కోడ్ కారణంగా ఇన్నాళ్లు నిలిచిపోయిన ప్రజావాణి ఈ వారమే మొదలైనా పెద్దగా ప్రజలు రాలేదు. ఈ మేరకు వచ్చిన వారి నుంచి ఫిర్యాదులు, దరఖాస్తులను స్వీకరించిన అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు ప్రతీ ఫిర్యాదును పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఇదిలా ఉండగా రెవెన్యూ సంబంధిత సమస్యలపైనే ఎక్కువగా ఫిర్యాదులు అందాయని అధికారులు వెల్లడించారు. వేంసూరు మండలం ఎర్రగుంటపాడుకు చెందిన వాసం లక్ష్మయ్య తనకు రెండెకరాల భూమికి పాస్ పుస్తకం ఉండగా సర్వే చేయించాలని కోరారు. అదే విధంగా ఎర్రుపాలెం మండలం మామూనూరు మత్స్య పారిశ్రామిక సహకార సంఘంలో తమకు వృత్తి, నైపుణ్య పరీక్షలు నిర్వహించి సభ్యత్వం ఇప్పించాలని విన్నవించారు. ఇలా వివిధ శాఖలకు సంబంధించి అందిన ఫిర్యాదులపై అదనపు కలెక్టర్లు సమీక్షించి అధికారులకు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ గణేష్, డీఆర్‌డీఓ సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

వర్షాలు మొదలవుతున్న తరుణాన సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముండడంతో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఆదేశించారు. హైదరాబాద్ నుంచి ఆమె సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. వర్షాలు, వరదలతో నష్టం జరగకుండా శిథిలమైన, కూలిపోయే స్థితిలో ఉన్న ఇళ్లను గుర్తించి కూల్చి వేయాలని, లోతట్టు ప్రాంతాల్లోకి వరద చేరకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించి, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు జిల్లా నుంచి అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, జెడ్పీ సీఈఓ ఎస్.వినోద్, డీఆర్‌డీఓ సన్యాసయ్య పాల్గొన్నారు.

వైరాకు 100 పడకల ఆస్పత్రి

స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే, అధికారులు



ఆస్పత్రికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు

వైరా: వైరా నియోజకవర్గ ప్రజలు ఏళ్లుగా ఎదురుచూస్తున్న వంద పడకల ఆస్పత్రి ఎట్టకేలకు మంజూరైంది. ఈసందర్భంగా ఆస్పత్రి నిర్మాణానికి ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సైదులు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు సోమవారం స్థలపరిశీలన చేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సమీపాన నాలుగెకరాల ప్రభుత్వ స్థలాన్ని ఆస్పత్రి నిర్మాణానికి ఎంపిక చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. వంద పడకల ఆస్పత్రితో పాటు నర్సింగ్ కళాశాల, ఇంటర్నేషనల్ స్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కూడా భూసేకరణ చేస్తున్నామన్నారు. రూ.30 కోట్ల నిధులతో చేపట్టే ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తయ్యే వరకు వైరాలోని కేవీసీఎం డిగ్రీ కళాశాల భవనంలో ఆస్పత్రి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు బొర్రా రాజశేఖర్, ఏదునూరి సీతారాములు, శీలం వెంకటనర్సిరెడ్డి, దాసరి దానియేలు, నారాయణరావు, నర్సింహారావు, అశోక్, కొండలు, గంగారావు, శ్రీధర్, డాక్టర్ సైదులు, వెంకటేశ్వర్లు, విద్యాసాగర్ పాల్గొన్నారు.

గుడ్డు.. వెరీ బ్యాడ్

- అంగన్‌వాడీల్లో కుళ్లిన గుడ్లు సరఫరా
- అధికారుల పర్యవేక్షణ కొరవడడమే కారణం
- చిన్నారులు, గర్భిణుల ఆరోగ్యంపై దుష్ప్రభావం



పాడైపోయిన కోడిగుడ్లు (ఫైల్)

ఖమ్మంవన్‌టౌన్: చిన్నారులు, గర్భిణులు, బాలింతల్లో పోషక లోపాలను అధిగమించేందుకు మహిళాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తూ పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. ఇందులో గర్భిణులు, బాలింతలకు ప్రతీ నెల 30, మూడేళ్ల లోపు చిన్నారులకు 16, మూడు నుండి ఆరేళ్ల లోపు పిల్లలకు రోజుకు ఒక గుడ్డు చొప్పున అందజేస్తారు. జిల్లాలో 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, గత నెల నివేదికల ఆధారంగా 8.10లక్షల గుడ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇదంతా బాగానే ఉన్నా అధికారుల పర్యవేక్షణ లోపమో.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో తెలియదు కానీ లబ్ధిదారులకు ఇచ్చే గుడ్లలో నాణ్యత ఉండడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అధికారులు చూస్తున్నారా?

జిల్లాలోని ఏడు ప్రాజెక్టు పరిధిలోని 1,840 అంగనాడీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. జిల్లా సంక్షేమాధికారితో పాటు ఏడుగురు సీడీపీఓలు, 69 మంది సూపర్‌వైజర్లు ఈ కేంద్రాలను పర్యవేక్షించాలి. ఇక 1,746 మంది అంగన్‌వాడీ టీచర్లు గాను 94 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే, అధికారులు, ఉద్యోగుల పర్యవేక్షణ లోపం లబ్ధిదారులకు ఇక్కట్లను తెచ్చిపెడుతున్నట్లు తెలుస్తోంది. పౌష్టికాహారంలో భాగంగా ఇచ్చే గుడ్లు నాణ్యత లేనివి, కుళ్లిపోయిన వస్తుండడంతో లబ్ధిదారులకు ఒక్కోసారి ప్రాణసంకటంగా మారుతోంది. ఆరోగ్యంగా ఎదగాల్సిన శిశువు దగ్గర నుండి చిన్నారుల వరకు ఏదైనా జరిగితే బాధ్యులెవరన్న ప్రశ్న తలెత్తుతోంది.

బరువు అంతంతే...

సాధారణ రోజుల్లో నెలకు రెండుసార్లు కాంట్రాక్టర్లు అంగన్‌వాడీ కేంద్రాలకు కోడిగుడ్లను సరఫరా చేస్తారు. ఇక వేసవి అయినందున మార్చి, ఏప్రిల్, మే నెలల్లో మాత్రం ఎండల కారణంగా గుడ్లు పాడయ్యే అవకాశం ఉండడంతో నెలకు మూడు సార్లు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఒక్కో గుడ్డు బరువు 42 గ్రాముల నుండి 50 గ్రాముల వరకు కచ్చితంగా ఉండాలని టెండర్ నిబంధనల్లో పొందుపరుస్తారు. కానీ అధికారుల పర్యవేక్షణలోపం, పట్టింపులేని తనంతో కాంట్రాక్టర్లు నాసిరకమైనవే కాక చిన్నవి, కొన్నిసార్లు పాడైనవి సరఫరా చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తాజాగా కామేపల్లి మండలం ఊట్కూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో లబ్ధిదారురాలైన చింతల సుమతి శనివారం కోడిగుడ్లను పరిశీలించి దుర్వాసన రావడంతో పడేసింది. అయితే, అక్కడి అంగన్‌వాడీ టీచర్ గుడ్లను సుమతికి ఇచ్చేటప్పుడే ఉడికించకుండా ముందుగా పగులగొట్టి చూడాలని సూచించడం అనుమానాలకు తావిస్తోంది.

అధిక ఉష్ణోగ్రతలే కారణమట...

గతనెల 29వ తేదీన ఊట్కూర్ అంగన్‌వాడీ కేంద్రానికి గుడ్లు సరఫరా కాగా, లబ్ధిదారురాలైన సుమతికి ఈనెల 6న టీచర్ ఇచ్చినట్లు చెబుతున్నారు. దీంతో ఆదివారం పగులగొట్టి చూడగా దుర్వాసన వచ్చాయని ఆమె ఫిర్యాదు చేసింది. ఈ విషయమై జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్‌ను వివరణ కోరగా... గుడ్లు సరఫరా చేసి 12రోజులు కావడంతో అధిక ఉష్ణోగ్రతల కారణంగా పాడై ఉండొచ్చని తెలిపారు. ఈవిషయమై ఆరా తీయగా ఆమెకు మాత్రమే పాడైన కోడిగుడ్లు వచ్చినట్లుగా తేలిందని, దీంతో కొత్తవి ఇచ్చినట్లు తెలిపారు. అయితే, అధికారి చెప్పినట్లు అధిక ఉష్ణోగ్రతతో గుడ్లు పాడై ఉంటే ఒక్క మహిళకే మాత్రం రావడం ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. ఇకనైనా లబ్ధిదారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కోడిగుడ్లు సహా ఇతర పౌష్టికాహారం పంపిణీలో అధికారులు పర్యవేక్షణ పెంచాలని పలువురు కోరుతున్నారు.

స్కానింగ్ కావాలా.. ఆగాల్సిందే

- పెద్దాస్పత్రిలో రేడియాలజిస్ట్ లేక ఇక్కట్లు
- విధులు నిర్వర్తిస్తున్న ఇద్దరు ట్రెయినీలు
- సిటీస్కాన్, అల్ట్రాసౌండ్ స్కానింగ్ కోసం పడిగాపులు



సిటీస్కాన్ గది వద్ద వేచి ఉన్న బాధితులు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో స్కానింగ్ కష్టాలు వెంటాడుతున్నాయి. రేడియాలజిస్ట్ పోస్టు ఖాళీ కావడంతో స్కానింగ్ అవసరమైన వారు గంటల తరబడి క్యూలైన్‌లో ఉన్నా పని కాక అవస్థ పడుతున్నారు. అత్యవసరమైన వారికి మాత్రమే స్కానింగ్ తీస్తుండడంతో మిగతా వారు నిరాశతో వెళ్లిపోవడమా లేదంటే ప్రైవేట్ సెంటర్‌కు వెళ్లి డబ్బులు సమర్పించడమో చేయాల్సి వస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రికి నిత్యం 1,500 మంది వరకు చికిత్స కోసం వస్తుండగా, సీజన్‌లో ఈ సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ఈనేపథ్యాన పలు విభాగాలు, ఎంసీహెచ్‌లో గర్భిణులకు అల్ట్రాసౌండ్, సిటీ స్కాన్ అవసరమవుతుంది. ఈ నేపథ్యాన అల్ట్రాసౌండ్ స్కానింగ్ తీయడానికి, సిటీస్కాన్ రిపోర్టులు చూడడానికి కొంత కాలం క్రితం వరకు డాక్టర్ వేణుగోపాల్ ఉండగా.. పనిభారం పెరగడం, అదనపు పోస్టులు కేటాయించకపోవడంతో ఆయన రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఫలితంగా ఆస్పత్రిలో రేడియాలజిస్ట్ పోస్టు ఖాళీ అయింది. ఇంతలోనే ఆస్పత్రికి అనుసంధానంగా మెడికల్ కళాశాల ఏర్పడడంతో పీజీ పూర్తిచేసిన సీనియర్ రెసిడెంట్ వైద్యులను ఏడాది పాటు శిక్షణ కోసం కేటాయించారు. వీరిలో ఇద్దరికి స్కానింగ్ విధులు అప్పగించినా నైపుణ్యం లేకపోవడంతో గంటల తరబడి ఆలస్యం జరుగుతోంది. ప్రస్తుతం ఇన్‌పేషంట్లలో అత్యవసరమైన వారికే అల్ట్రా సౌండ్, సిటీ స్కాన్ చేస్తుండగా మిగతా వారు ఎదురుచూడాల్సి వస్తోంది.

అత్యాధునిక యంత్రాలు ఉన్నా....

జిల్లా జనరల్ ఆస్పత్రిలో సూపర్‌స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు గత ప్రభుత్వం అత్యాధునిక యంత్రాలను సమకూర్చింది. ఇందులో భాగంగానే సిటీస్కాన్, అల్ట్రాసౌండ్, టిఫా స్కాన్ యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారా నిత్యం వందలాది మందికి స్కానింగ్ తీస్తుండడంతో రోగనిర్ధారణ, చికిత్స సులువైంది. కానీ యంత్రాలకు సరిపడా రేడియాలజిస్ట్, టెక్నీషియన్, సిబ్బంది పోస్టులను భర్తీ చేయలేదు. దీంతో తరచూ సమస్యలు ఎదురవుతున్నాయి. ఇప్పుడు ఉన్న ఒక్క రేడియాలజిస్ట్ వెళ్లిపోవడంతో సమస్య మరింత జటిలమైంది. రేడియాలజిస్ట్ లేక.. సిటీ స్కాన్‌లో ఒక్క ఉద్యోగి, ఇద్దరు సీనియర్ రెసిడెంట్లతోనే నెట్టుకొస్తుండడంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. అత్యవసర కేసులు వచ్చినప్పుడు అర్ధరాత్రి, అపరాత్రి తేడా లేకుండా సదరు ఉద్యోగిని పిలిపించాల్సి వస్తోందని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యాన అవసరమైన మేరకు ఉద్యోగులకు నియమిస్తే తప్ప ఈ సమస్య పరిష్కారమయ్యే మార్గం కనిపించడం లేదు.

త్వరలో పోస్టుల భర్తీ



రేడియాలజిస్ట్ వెళ్లిపోవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్న విషయం నిజమే. ప్రస్తుతం సమస్యలు రాకుండా ఎస్‌ఆర్‌లతో స్కానింగ్ చేయిస్తున్నాం. త్వరలోనే అవసరమైన మేరకు రేడియాలజిస్ట్ పోస్టులు భర్తీ చేస్తాం. ఇప్పటికే కలెక్టర్‌కు ప్రతిపాదనలు సమర్పించాం. అలాగే, అవసరమైన టెక్నీషియన్లను కూడా నియమిస్తాం. అప్పటివరకు ఎవరికీ ఇబ్బంది ఎదురుకాకుండా పర్యవేక్షిస్తున్నాం.

– ఎల్.కిరణ్‌కుమార్, ఆస్పత్రి సూపరింటెండెంట్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్ : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు భారీగా హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కాగా, సోమవారం నిర్వహించిన నిత్యకల్యాణానికి 35, పట్టాభిషేకానికి 14 టికెట్లు విక్రయించినట్లు అధికారులు వెల్లడించారు.

'డిపెండెంట్ల' వయోపరిమితి పెంపు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగులకు యాజమాన్యం తీపికబురు అందించింది. వారి వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసిందని ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ నాయకులు జనక్‌ప్రసాద్, సీతారామయ్య తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఈ అంశంపై చర్చించి ఆమోదం తెలిపిన నేపథ్యాన ఈ మేరకు నిర్ణయం తీసుకుందని వివరించారు. తద్వారా సుమారు 600 మందికి లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

క్లుప్తంగా

ఖమ్మం మార్కెట్‌లోకి హీరో మావ్రిక్



వాహనాన్ని విడుదల చేస్తున్న వారితో యాజమాన్యం

ఖమ్మంగాంధీచౌక్: ప్రముఖ టూ వీలర్ కంపెనీ హీరో మోటోకార్ప్ సరికొత్తగా రూపొందించిన మావ్రిక్ ద్విచక్ర వాహనాన్ని సోమవారం ఖమ్మం శ్రీశ్రీశ్రీ ఆటోమొబైల్స్ హీరో షోరూం లో విడుదల చేశారు. ఈ వాహనాన్ని డాక్టర్ కూరపాటి ప్రదీప్, పోట్ల నాగేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు విడుదల చేయగా షోరూం యాజమాన్యం రంగనాథ్, భార్గవప్రసాద్ మాట్లాడారు. మావ్రిక్ వాహనం 440 సీసీ ఇంజన్, 27 బీహెచ్‌పీ డ్యూయల్ చానల్ ఏబీఎస్‌తో పాటు పలు అధునాతనమైన ఫీచర్లను ను కలిగి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విష్ణు మొలకల, సాయి, కాళ్ల సూర్య, ఖమ్మంపాటి భాస్కర్, వివేకానందరెడ్డి, కృష్ణప్రసాద్, పాదిలి వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్తగూడెంలో మంత్రి పొంగులేటి సమీక్ష

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం కొత్తగూడెంలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో ఉదయం 11గంటలకు వివిధ శాఖల అధికారులతో సమావేశమై అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షిస్తారు. అనంతరం ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయానికి చేరుకుంటారు.

'విద్యాక్షేత్ర'లో ఒత్తిడి లేని విద్య



పాఠశాలను ప్రారంభిస్తున్న మేయర్ నీరజ, పక్కన యాజమాన్యం సౌభాగ్యం, భారతి తదితరులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం మమత ఆస్పత్రి రోడ్డులోని శ్రీనగర్‌కాలనీలో నూతనంగా ఏర్పాటుచేసిన విద్యాక్షేత్ర పాఠశాలలో విద్యార్థులకు ఒత్తిడి లేని విద్య అందనుందని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. పాఠశాలను సోమవారం ఆమె యజమాన్యం సౌభాగ్యం, భారతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఒత్తిడి లేని విద్య అందించేందుకు యజమాన్యం కట్టుబడి ఉండటం అభినందనీయమన్నారు. ఇంకా ఈకార్యక్రమంలో కార్పొరేటర్లు వలరాజు, మంజుల నరేంద్ర, డీసీసీబీ మాజీ చైర్మన్ నాగభూషణం, వివిధ పాఠశాలల యజమాన్యాలు వంగా సాంబశివారెడ్డి, కేసా వీరన్న, రవిమారుత్, పార్వతిరెడ్డి, గోపి, ప్రైవేట్ స్కూళ్ల అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రం కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

14, 15వ తేదీల్లో సీపీఐ శిక్షణా తరగతులు

ఖమ్మంమయూరిసెంటర్: పార్టీ కార్యకర్తల్లో సైద్ధాంతిక, రాజకీయ అవగాహన పెంపొందించేందుకు ఈనెల 14, 15వ తేదీలలో రాజకీయ శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ తెలిపారు. ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో జరిగే తరగతుల్లో ఎం.డీ.యూసఫ్, నాగపూర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ యుగల్ రాయులు, ప్రొఫెసర్ కాశీం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, భాగం హేమంతరావు వివిధ అంశాలపై బోధిస్తారని పేర్కొన్నారు. అలాగే, 15వ తేదీన జిల్లా కౌన్సిల్ సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు.

దివ్యాంగ బాలుర వసతిగృహంలో ప్రవేశాలు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మంలోని ప్రభుత్వ దివ్యాంగుల బాలుర వసతిగృహంలో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి కె.రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. 3నుండి 10వ తరగతి వరకు చదువుతున్న దివ్యాంగ బాలురకు వసతిగృహంలో ఉచిత భోజనం, నోట్‌బుక్స్, దుప్పట్లుతో సహా వైద్య సేవలు కూడా అందిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల నుంచి తీసుకున్న ఒరిజినల్ బోనఫైడ్ సర్టిఫికెట్‌తో కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో లేక వీ.వీ.పాలెంలోని వసతి గృహంలో జూలై 30లోగా దరఖాస్తు అందించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 95028 75146 నంబర్‌లో సంప్రదించాలని సంక్షేమాధికారి తెలిపారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	2,100	2,100
పెసలు	4,100	4,100
మిర్చి	16,000	9,000
మిర్చి తాలు	8,200	8,200
ఏసీ మిర్చి	20,200	10,000
పత్తి	7,000	5,000

– ఖమ్మం వ్యవసాయం

వైద్యరంగంలో ప్రగతి, పురోగతి

- గడిచిన పదేళ్లలో మెరుగైన వైద్యసేవలు
- ఆస్పత్రుల అప్‌గ్రేడ్. మౌలిక వసతుల కల్పన
- ప్రభుత్వ మెడికల్ కళాశాలతో అత్యాధునిక వైద్యం



ఖమ్మంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం

ఖమ్మంవైద్యవిభాగం: తెలంగాణ ఏర్పడ్డాక దశాబ్ద కాలంలో వైద్య రంగంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. ప్రధానంగా జిల్లాలో ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. పల్లె, పట్టణ దవాఖానాల ఏర్పాటు, పలు ఆస్పత్రులను అప్‌గ్రేడ్ చేయటం, జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి స్థాయిని పెంచడంతో ఎక్కువ మందికి వైద్య సేవలు అందించటం సాధ్యమవుతోంది. తెలంగాణ ఏర్పడకముందు ఆస్పత్రి 250 పడకలతో ఉండగా ఇప్పుడు 575 పడకలకు చేరింది. అలాగే, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల కోసం 150 పడకల సామర్థ్యంతో మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. అంతేకాక కార్డియాలజీ సేవలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యాన గుండె సంబంధిత బాధితులు హైదరాబాద్ వెళ్లకుండా ఇక్కడే చికిత్స అందుతోంది. వీటికి తోడు సిటీ స్కాన్, రేడియాలజీ ల్యాబ్, వైరాలజీ ల్యాబ్, డయాగ్నస్టిక్ హబ్ వంటివి అందుబాటులోకి రావటంతో వైద్య సేవలు మెరుగుపడ్డాయి. ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి అనుసంధానంగా మెడికల్ కళాశాల ఏర్పాటు కావటంతో జిల్లాలో వైద్య సేవలు దశాబ్ద కాలంతో పోలిస్తే గణనీయంగా మెరుగయ్యాయి.

● పల్లె, బస్తీ దవాఖానాలు

పట్టణ, పల్లెల్లో ప్రాథమిక ఆరోగ్యాన్ని బలోపేతం చేసేందుకు జిల్లాలో తొమ్మిది బస్తీ దవాఖానాలు ఏర్పాటుచేశారు. ఖమ్మం నగరంలో ఏడు, సత్తుపల్లి, మధిరలో ఒక్కొకటి చొప్పున ఇవి ఏర్పాటయ్యాయి. అలాగే క్షేత్రస్థాయిలో సబ్ సెంటర్లను అప్‌గ్రేడ్ చేసి పల్లె దవాఖానాలులుగా ఏర్పాటు చేశారు. జిల్లాలో 224 సబ్ సెంటర్లకు గాను 161 సెంటర్లను పల్లె దవాఖానాలుగా మార్చి 12 రకాల వైద్య సేవలు అందిస్తుండడంతో క్షేత్రస్థాయిలో సేవలు అందుతున్నాయి.

● గుండె బాధితులకు..

జిల్లా పెద్దాస్పత్రిలో రూ.7కోట్ల వ్యయంతో క్యాథ్ ల్యాబ్ ఏర్పాటుచేశారు. ఇప్పటివరకు 1,400 మంది గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి శస్త్ర చికిత్స అందించారు. కరోనరీ యాంజియోగ్రామ్ శస్త్ర చికిత్సతో పాటు స్టంట్లు, బలూన్ యాంజియోప్లాస్టీ, రెనల్ యాంజియోగ్రామ్, రూట్ యాంజియోగ్రామ్, కారోటిడ్ యాంజియోగ్రామ్, పెరిపెరల్ యాంజియోగ్రామ్ బ్రాంకియల్ యాంజియోగ్రామ్, పెరీ కార్డియో సెంటెసిస్ వంటి తదితర సేవలు అందిస్తుండటంతో నిరుపేదలు దూరప్రాంతాలకు, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన ఇక్కట్లు తప్పాయి.

● కేన్సర్ బాధితులకు అండగా...

పెద్దాస్పలో పాలియేటివ్(ఆలన) సేవలు అందుబాటులోకి తీసుకురాగా, కేన్సర్, పక్షవాతంతో బాధపడేవారికి వైద్యం అందుతోంది. ఈ సెంటర్‌లో ఏడు బెడ్ల సామర్థ్యంతో ఐదేళ్ల నుంచి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడ ఇన్‌పేషంట్ సేవలే కాకుండా జిల్లాలో గుర్తించిన బాధితుల ఇళ్లకు వెళ్లి చికిత్స అందిస్తున్నారు.

● తల్లిపాల సేకరణ కేంద్రం

జిల్లా ఆస్పత్రిలో గత ఏడాది రూ.40లక్షల వ్యయంతో తల్లిపాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభించారు. తల్లుల నుండి పాలు సేకరించి ఇక్కడ భద్రపరుస్తున్నారు. ఆపై తక్కువ బరువుతో పుట్టిన బిడ్డలు, పాలు ఉత్పత్తికాని బాలింతల పిల్లలకు వీటిని వినియోగిస్తుండడంతో శిశు మరణాలను తగ్గించడంలో కీలకంగా నిలుస్తోంది.

● సిటీ స్కాన్ సేవలు

జిల్లాలో తొలిసారి ప్రభుత్వ పరంగా ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సిటీ స్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. 2021 ఆగస్టులో రూ.2కోట్ల వ్యయంతో సిటీ స్కాన్ మిషన్ ప్రారంభించారు. ఇది అత్యాధునికమైనది కావడంతో కచ్చితమైన నివేదికలు వస్తున్న నేపథ్యాన వైద్యం అందించడం సులువవుతోంది.

● 6.44 లక్షల మందికి కంటి పరీక్షలు

కంటి వెలుగు కార్యక్రమాన్ని 2018లో తొలి విడతగా నిర్వహించారు. అనంతరం 2023 జనవరిలో రెండో విడత నిర్వహించారు. ఈమేరకు 6,44,134 మందికి కంటి పరీక్షలు నిర్వహించి కంటి సమస్యలతో బాధపడుతున్న 1,26,065 మందికి రీడింగ్ గ్లాసులు పంపిణీ చేశారు. అలాగే తీవ్రమైన సమస్యతో బాధపడుతున్న 83,365 మందిని గుర్తించి 59,4454 మందికిప్రిస్కిప్షన్ గ్లాసులు అందించడంతో వారికి ఉపశమనం కలిగింది.

మెరుగుపడిన వైద్య సేవలు



జిల్లాలో గతంలో పోలిస్తే వైద్యసేవలు మెరుగుపడ్డాయి. పల్లె, బస్తీ దవాఖానాలే కాక ఏరియా ఆస్పత్రుల ఏర్పాటు, వైద్యులు, సిబ్బంది నియామకంతో మెరుగైన వైద్యం అందుతోంది. కరోనా సమయంలోనూ అత్యవసర సేవలు అందించి ప్రజల ప్రాణాలను కాపాడాం. దశాబ్ద కాలంలో జిల్లాలో వైద్య పరంగా అత్యాధునిక సేవలు అందుబాటులోకి వచ్చాయి.

– డాక్టర్ బి.మాలతి, డీఎంహెచ్ఓ

డయాగ్నస్టిక్ హబ్



■ గర్భిణులకు వరం

మాతా శిశు సంరక్షణకు పెద్దపీట వేసే క్రమంలో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌ను ప్రవేశపెట్టారు. ఈమేరకు ఐరన్ సిరప్, కర్జూర, న్యూట్రిషన్ మిక్స్ పౌడర్, నెయ్యి, నట్టల నివారణ మాత్రలతో కూడిన కిట్లను రెండు దఫాలుగా అందించారు. రక్తహీనతతో బాధపడుతున్న వారి సంఖ్య జిల్లాలో ఎక్కువగా ఉండగా.. ఈ కిట్ల పంపిణీతో గర్భిణుల్లో అనారోగ్య సమస్యలు పరిష్కారమై బిడ్డ సరైన ఎదుగుదల సాధ్యమైంది. అంతేకాక ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవించిన వారి కోసం 2017 జూన్ 2న కేసీఆర్ కిట్ పథకాన్ని ప్రారంభించారు. దీంతో ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇక మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా గత ఏడాది మార్చి 8న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ కార్యక్రమం సైతం జిల్లాలో సత్ఫలితాలనిస్తోంది. పూర్తిగా మహిళా ఉద్యోగులతో ప్రతీ మంగళవారం ఖమ్మం పెద్దాస్పత్రిలో పరీక్షలు నిర్వహిస్తుండగా.. సమస్యలు బయటకు చెప్పుకోవడానికి అవస్థ పడిన మహిళలు ధైర్యంగా ముందుకొస్తున్నారు.

ఇది ప్రకృతి 'చిత్రం'



ఇది ఏ కళాకారుడి కుంచె నుంచి జాలువారిన పెయింటింగ్ కాదు.. ప్రకృతి గీసిన చిత్రమిది! సాయంకాలం సూర్యుడు మబ్బుల చాటుకు వెళ్తున్న సమయాన.. ఇంకోపక్క చంద్రుడు ప్రకాశిస్తుండగా ఆకాశం నీలం రంగులోకి మారిన దృశ్యమే ఇది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ నుంచి భద్రాచలం వెళ్లే మార్గాన కిన్నెరసాని బ్రిడ్జి వద్ద సోమవారం సాయంత్రం ఈ దృశ్యం కనిపించడంతో పలువురు తమ సెల్‌ఫోన్ కెమెరాల్లో బంధించారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

పవర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రాజెక్టు ప్లానింగ్ బృందం సభ్యులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా జేకే ఓసీలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పంప్ స్టోరేజ్ పవర్ ప్లాంట్‌కు అనువైన స్థలాన్ని కార్పొరేట్ ప్రాజెక్టు ప్లానింగ్ బృందం సోమవారం పరిశీలించింది. ఈ పంప్ స్టోరేజ్ పవర్ ప్లాంట్‌తో సహజ వనరులతో విద్యుత్ ఉత్పత్తి చేసే దిశగా యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్లాంట్ ఏర్పాటైతే ఇల్లెందుకు పూర్వ వైభవం లభిస్తుందని భావిస్తోంది. కాగా, ఇల్లెందులో పర్యటించిన కార్పొరేట్ ప్రాజెక్టు ప్లానింగ్ బృందంలో జీఎం(సీపీపీ) రవికుమార్, జీఎం(సర్వే) జైనువుద్దీన్, ఏజీఎం(ఇఅండ్‌ఎం) బీడీవీ ప్రసాద్, ఎస్ఈ(ఈఅండ్ఎం) నటరాజ్, ఎస్ఈ(ఈఎం)(సోలార్) నటరాజ్ ప్రసాద్, ఎస్ఈ(ఈఎం నాగేంద్ర కుమార్, ఇల్లెందు ఏరియా జీఎం జాన్‌ఆనంద్, జేకే ఓసీ ప్రాజెక్టు అధికారి బొల్లం వెంకటేశ్వర్లు, ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, డీజీఎం(సర్వే) బాలాజీ నాయుడు, ఎస్టేట్ అధికారి శివకుమార్ ఉన్నారు.

రూ.20లక్షల విలువైన గంజాయి స్వాధీనం

ముళ్ల పొదల్లో దాచిన నిందితులు



స్వాధీనం చేసుకున్న గంజాయితో ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు

ఖమ్మంక్రైం: గంజాయిపై ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్న వేళ.. కొందరు అక్రమ రవాణాకు కొత్త మార్గాలను వెతుక్కుంటున్నారు. ఈక్రమంలోనే సోమవారం ఖమ్మంలోని కొత్త బస్టాండ్ సమీపాన ముళ్ల పొదల్లో దాచిన గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముళ్ల పొదల్లో అక్రమార్కులు గంజాయిని భద్రపర్చారనే సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకరి రమేష్, సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈమేరకు మూడు సంచుల్లో ఉన్న రూ.20లక్షల విలువైన 39.5 కిలోల గంజాయి లభ్యమైంది. ఒడిస్సా, భువనేశ్వర్ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన గంజాయిని అదును చూసి బస్సులో తరలించేందుకు ఇక్కడ దాడినట్లు గుర్తించామని సీఐ తెలిపారు. తనిఖీల్లో ఉద్యోగులు బాబు, సుధీర్, హరీశ్, వెంకటేష్, విజయ్, హన్మంతరావు, బేబీ, స్వరూప పాల్గొన్నారు. కాగా, గంజాయి స్వాధీనం చేసుకున్న సీఐ, ఉద్యోగులను డీసీ జనార్ధన్‌రెడ్డి, ఏసీ గణేష్, ఏఈఎస్ తిరుపతి అభినందించారు.

అగ్నిప్రమాదంలో మాజీ సర్పంచ్ ఇల్లు దగ్ధం

రూ.10 లక్షల మేర ఆస్తినష్టం



ప్రమాదంలో కాలిపోయిన సామగ్రి

ఏన్కూరు: మండలంలోని తూతకలింగన్నపేటలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో మాజీ సర్పంచ్ రేసు వెంకయ్యతో పాటు పక్కనే ఉన్న ఆయన బంధువుల ఇల్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం... అర్ధరాత్రి అందరూ నిద్రలో ఉన్న సమయాన ఒకేసారి వెంకన్న ఇంట్లో ప్రమాదవశాత్తు ఇంట్లో మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు వెంకయ్య కుటుంబీకులకు తెలపగా వారి చూసేలోగా ఆయనతో పాటు మరో ఇంటికి మంటలు అంటుకున్నాయి. దీంతో అందరూ కట్టుబట్టలతో సహా బయటకు వచ్చేశారు. గ్రామస్తులంతా కలిసి మంటలు ఆర్పే ప్రయత్నాలు చేస్తుండగానే వైరా నుంచి ఫైర్ ఇంజన్ వచ్చినా రెండు ఇళ్లతో పాటు పక్కనే ఉన్న వరిగడ్డి వాము సైతం కాలిపోయింది. ఈ ఘటనలో ఇంట్లోని బంగారు ఆభరణాలు, సామగ్రి, నగదు, బియ్యం, పిల్లల ఒరిజనల్ ధృవపత్రాలు కాలిపోవడంతో రూ.10 లక్షల మేర ఆస్తినష్టం వాటిల్లింది. వెంకయ్య రెండు పర్యాయాలు సర్పంచ్‌గా చేసినా గడ్డి ఇంట్లోనే నివాసముంటున్నాడు. ఈమేరకు సమాచారం అందుకున్న తహసీల్దార్ సీహెచ్.శేషగిరిరావు, ఆర్ఐ నవీన్ సోమవారం ఉదయం వివరాలు సేకరించారు. అలాగే, మాజీ సర్పంచ్ కుటుంబాన్ని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సైతం పరామర్శించారు. తహసీల్దార్‌తో మాట్లాడి వారికి తక్షణం సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కాంగ్రెస్ నాయకులు స్వర్ణ నరేందర్, వేముల కృష్ణప్రసాద్, పాశం శ్రీనివాసరావు, మేడ ధర్మారావు, చందమామ నర్సింహరావు, గిద్దగిరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డయాలసిస్ యూనిట్లు మంజూరు

ఇల్లెందు/పాల్వంచ: ఉమ్మడి జిల్లాలోని పాల్వంచ, సత్తుపల్లి, చర్ల ఆస్పత్రులకు డయాలసిస్ యూనిట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర వైద్యవిధాన పరిషత్, తెలంగాణ రాష్ట్ర హెల్త్ అండ్ మెడికల్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ సోమవారం ఉత్తర్వులు జారీచేశాయి. సత్తుపల్లి, పాల్వంచ, చర్ల ఆస్పత్రులకు ఒక్కో యూనిట్ చొప్పున డయాలసిస్ సెట్ మంజూరు చేస్తూ కుటుంబ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ క్రిష్టినా జడ్ చొంగ్తూ ఆదేశాలు ఇచ్చారు. కాగా ఒక్కో సెట్‌లో ఐదు మిషన్లు ఉండగా, మూడు ఆస్పత్రులకు కలిపి 15 మిషన్లు మంజూరయ్యాయి. దీంతో డయాలసిస్ బాధితులకు మెరుగైన వైద్యం అందే అవకాశం ఉంది.



ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రి

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి



సమీక్షలో మాట్లాడుతున్న డీఈ రామారావు

కొణిజర్ల: విధి నిర్వహణలో ఉద్యోగులు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరిస్తూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా పర్యవేక్షించాలని ట్రాన్స్‌కో ఖమ్మం డీఈ నంబూరి రామారావు సూచించారు. కొణిజర్ల మండలం పెద్దగోపతిలో ఏఈలు, సిబ్బందితో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్పేషల్ల నిర్వహణ, విద్యుత్ లైట్లను అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడం, పాడైపోయిన ఇన్సులేటర్లు మార్చడంపై తదితర అంశాలపై సూచనలు చేశారు. అలాగే, వానాకాలంలో పనులు చేసే సమయాన ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఏడీఈ ఎల్ తిలక్, ఏఈలు రాయల సురేష్, సుంకర స్వాతి, చింతకాని వెంకన్న, నాగులవంచ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత

భద్రాచలంటౌన్: కాకతీయ యూనివర్సిటీ ప్రకటించిన 2022–24 విద్యా సంవత్సరం బీఈడీ ఫైనల్ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో భద్రాచలం గిరిజన బీఈడీ కళాశాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. గత నెలలో నిర్వహించిన చివరి సెమిస్టర్ పరీక్షలకు 94 మంది విద్యార్థులు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. 7.79 సీజీపీఏతో కొప్పు మానిక ప్రథమ, 7.76 సీజీపీఏతో వాంకుడోత్ సంతోష్ కుమార్ ద్వితీయ, 7.68 సీజీపీఏతో పూనెం తనుజ ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వీరూ నాయక్, డీడీ మణెమ్మను పీఓ అభినందించారు.

కొత్త బస్టాండ్‌లో బంగారు గొలుసు చోరీ

ఖమ్మంక్రైం: ఖమ్మం కొత్త బస్టాండ్‌లో ఓ మహిళ బ్యాగ్ నుంచి బంగారు గొలుసు చోరీకి గురైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం ద్వారకానగర్‌కు చెందిన రమాదేవి విజయవాడ వెళ్లడానికి సోమవారం బస్టాండ్‌కు వచ్చింది. బస్ ఎక్కి చూశాక తన బ్యాగ్‌లోని చంద్రహారం పెట్టె ఖాళీగా ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో సీఐ బాలకృష్ణ, ఎస్ఐ సూరజ్ చేరుకుని బస్టాండ్‌లోని సీసీ పుటేజీలను పరిశీలించారు. కాగా, రమాదేవితో పాటు అదే బస్సు ఎక్కడానికి వచ్చిన వ్యక్తి గొలుసు చోరీ చూసి ఉంటారని భావిస్తున్నారు. చోరీ అయిన గొలుసు విలువ రూ.3లక్షల వరకు ఉంటుందని బాధితురాలు వెల్లడించింది. అయితే, బస్టాండ్‌లో చోరీలు జరుగుతున్నా పోలీసులు, ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కల్లూరురూరల్: కల్లూరు మండలం ఎర్రబోయినపల్లిలో సోమవారం జరిగిన దాడిలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన రైతు కాకర్ల రంగారావు భూమిలో మరో రైతు జాడును పువ్వాళ్ల కోటయ్యకు చెందిన గేదెలు, దూడలు మేస్తుండగా రంగారావు కుమారుడు నరేంద్ర అడ్డుకున్నాడు. దీంతో కోటయ్య.. నరేంద్రను కొడుతుండగా కాకర్ల రోశయ్య, చిలకమ్మ అడ్డుగా వెళ్లారు. ఈమేరకు పువ్వాళ్ల కోటయ్య, పువ్వాళ్ల బాబి, పువ్వాళ్ల లక్ష్మి, మరో ఇద్దరు నరేంద్రను వదిలిపెట్టి తమను కొట్టారని రోశయ్య, చిలకమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో గాయపడిన వీరిని ఖమ్మం తరలించారు.

రైలుకింద జారిపడి మృతి

బోనకల్: మధిర – మోటమర్రి స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి(32) సోమవారం రైలు నుండి జారిపడి మృతి చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. కాగా, మృతదేహన్ని అన్నం సేవా ఫౌండేషన్ సభ్యుల సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్ప మార్చురీకి తరలించినట్లు వెల్లడించారు.

దైవ దర్శనానికి వెళ్లి..

గోదావరిలో తల్లీకొడుకులు గల్లంతు

అశ్వారావుపేటరూరల్: దైవ దర్శనానికి వెళ్లి గోదావరిలో తల్లీకొడుకులు గల్లంతైన ఘటన సోమవారం జరిగింది. అశ్వారావుపేటలోని చిన్నంశెట్టిబజార్‌కు అల్లంశెట్టి నాగేశ్వరరావు, వంటకాల వెంకటేశ్వరరావు కుటుంబాలకు చెందిన 11 మంది రెండు ఆటోల్లో ఏపీలోని ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలం కట్కూరు శివాలయానికి వెళ్లారు. దైవ దర్శనం అనంతరం పిల్లలు స్నానాలు చేద్దామని కోరడంతో అంతా గోదావరిలోకి దిగారు. ఈక్రమంలో అల్లంశెట్టి నాగేశ్వరరావు కుమారుడు తేజ శ్రీనివాస్(23) కాలుజారి నీట మునుగుతూ కేకలు వేశాడు. గమనించిన తల్లి నాగమణి(43) కుమారుడిని కాపాడే క్రమంలో నీటిలో గల్లంతైంది. కుటుంబీకులంతా చూస్తుండగానే ఈ ఘటన క్షణాల్లో జరిగిపోగా, ఇద్దరూ గోదారిలో కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న వేలేరుపాడు మండల అధికారులు చేరుకుని గజ ఈతగాళ్లతో గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. దాదాపు రెండు గంటల తర్వాత నాగమణి, తేజ శ్రీనివాస్ మృతదేహాలు లభ్యం కాగా ఒడ్డుకు తీసుకొచ్చారు. అక్కడి పోలీసులు మృతదేహాలను వేలేరుపాడు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా అశ్వారావుపేటలో చిరు వ్యాపారం సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న నాగేశ్వరరావు భార్య, కుమారుడి మృతితో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు దుర్మార్గం: కొంతం

సాక్షి, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన తెలుగుదేశం, ఆ పార్టీ కార్యకర్తలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఇళ్లతో పాటు భౌతిక దాడులు చేయడం దుర్మార్గమని తెలంగాణ అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంతం గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, ఇలా దాడులకు పాల్పడటం అనాగరికమని పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇలాంటి అరాచకాలతో శాంతిభద్రతలకు విఘాతం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. గవర్నర్ వెంటనే జోక్యం చేసుకుని, రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌తోనే కూటమికి అధికారం

- దళిత బహుజన పార్టీ అధ్యక్షుడు వడ్లమూరి


మాట్లాడుతున్న దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్

లిబర్టీ: ఆంధ్రప్రదేశ్‌లో ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి తెలుగుదేశం, జనసేన, బీజేపీల కూటమి గెలుపొందిందని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ ఆరోపించారు. ఎన్నికల ఫలితాల్లో ఊహించని విధంగా ఆయా పార్టీలకు మెజార్టీ రావడంతో మేధావులు, విశ్లేషకులతో పాటు సామాన్య జనంలోనూ అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. హైదరాబాద్‌లోని ఆయన మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 12కి పైగా ఎన్నో ప్రముఖ సంస్థలు వైఎస్సార్‌సీపీ గెలుస్తుందని ఎగ్జిట్ పోల్స్‌లో వెల్లడిస్తే అందుకు భిన్నంగా కూటమి విజయం సాధించడం వెనుక ట్యాంపరింగ్ జరిగిందనే అనుమానాలను కొట్టి పారేయలేమన్నారు. అందుకే ఎన్నికల ఫలితాలపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈవీఎంలు తయారు చేసే సంస్థలు దాదాపు 30 ఉండగా, అందులో బీజేపీకి చెందిన వారివే ఎక్కువ సంస్థలు ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ట్యాంపరింగ్ చేసే అవకాశం ఉందని గతంలో స్వయంగా చంద్రబాబునాయుడే ప్రకటించారని వడ్లమూరి గుర్తు చేశారు.


వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

వైఎస్ జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ ముఖ్యనేతలు

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌ని పార్టీ ముఖ్య నాయకులు, ఇటీవలి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు కలిశారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో ఆయనతో భేటీ అయ్యారు. చాలాసేపు పలు అంశాలపై చర్చించారు. వైఎస్ జగన్‌ను కలిసిన వారిలో ఎంపీలు గొల్ల బాబురావు, మోపిదేవి వెంకటరమణ, మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, పాముల పుష్ప శ్రీవాణి, గుడివాడ అమర్‌నాథ్, నాయకులు రెడ్డి శాంతి, చిర్ల జగ్గిరెడ్డి, విశ్వాసరాయ కళావతి, బుట్టా రేణుక, చింతా అనురాధ, గొడ్డేటి మాధవి, శోభా హైమావతి, వంగా గీత, ధనలక్ష్మి, విజయ, డాక్టర్ సత్యవతి, ఉమాబాల, ఎల్ అప్పిరెడ్డి, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.


గోపువానిపాలెంలో ధ్వంసం చేసిన వైఎస్సార్ విగ్రహం


నంద్యాల మండలం రాయమల్పురంలో టీడీపీ నాయకులు ధ్వంసం చేసిన అభివృద్ధి శిలాఫలకాలు


కూరాడ సచివాలయంపై ఉన్న వైఎస్సార్, వైఎస్ జగన్ చిత్రాలను గునపంతో పగలకొడుతున్న జనసేన కార్యకర్త

పరాకాష్టకు విధ్వంసకాండ

విగ్రహాలపై అక్కసు

- రెచ్చిపోయి వ్యవహరిస్తున్న టీడీపీ, జనసేన శ్రేణులు
- గోపువానిపాలెంలో వైఎస్సార్ విగ్రహం ధ్వంసం
- పలుచోట్ల శిలాఫలకాల తొలగింపు

▶ మొదటి పేజీ తరువాయి
చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీలో ఎవరూ ఉండకూడదన్నట్లు బెదిరింపులకు దిగుతున్నారు. ఈ పార్టీకి ఓట్లేసిన వారిని దుర్భాషలాడుతున్నారు. ఓట్లు వేయించిన వారు ఊరు వదిలి వెళ్లాలని హుకుం జారీ చేస్తున్నారు. ఇది అన్యాయం కదా.. అని ప్రశ్నిస్తే దుస్తులు విప్పి కొడుతున్నారు. ఏ తప్పూ చేయకపోయినా, వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇచ్చినందుకు బహిరంగ క్షమాపణలు చెప్పిస్తున్నారు. యూనివర్సిటీ వీసీలపై దౌర్జన్యం చేస్తున్నారు. పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్రంలో ఇదివరకు ఇలా ఎప్పుడైనా జరిగిందా? ఇప్పుడే ఎందుకు ఇలా జరుగుతోంది? టీడీపీ నేతలు, కార్యకర్తలు నేరుగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని విధ్వంసం సృష్టిస్తుంటే.. ప్రభుత్వ ఆస్తులను పాడు చేస్తుంటే.. స్పందించాల్సిన పోలీసులు ఎందుకు చేష్టలుడిగి చూస్తున్నారు? నిజంగా ఈ పరిణామం ఖాకీ డ్రస్సుకే అవమానం.

దేశ చరిత్రలో ఇదివరకెన్నడూ లేని రీతిలో గత ఐదేళ్లలో గ్రామాల్లో ప్రభుత్వ కార్యాలయాల భవనాలు వెలిశాయి. ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, సచివాలయాలు, కొత్త రూపు రంగరించుకున్న స్కూళ్లు.. ఇలా ఎన్నెన్నో ప్రభుత్వ బిల్డింగ్‌లు నిర్మాణమయ్యాయి. ఒక్కో గ్రామానికి కోట్లాది రూపాయల విలువైన ఆస్తి సమకూరింది. ఇదంతా ప్రజలందరి ఉమ్మడి ఆస్తి. భద్రంగా కాపాడుకోవాలి. అలాంటిది పని గట్టుకుని ఊరూరా టీడీపీ సేన గునపాలు చేత పట్టుకుని ధ్వంసం చేస్తుండటాన్ని ఏమనాలి? రౌడీయిజం, దౌర్జన్యం, ఉన్మాదం .. ఇలా ఈ పదాలన్నీ తక్కువే. ఎవర్ని చూసుకుని ఇలా పేట్రేగిపోతున్నారు? చంద్రబాబు, లోకేశ్‌లను చూసుకునే కదా!

బాపట్ల జిల్లాలో పిండ ప్రదానం చేస్తుంటే అడ్డుకోవడం .. మంగళగిరిలో వైఎస్సార్‌సీపీ అభిమాని ఇంటిని జేసీబీతో కూల్చేయడం.. ఏకంగా నెల్లూరు మేయర్ దంపతులనే బెదిరించడం.. ఇదే జిల్లా దత్తులూరు మండలంలో జగనన్న లే అవుట్‌లోని ఇళ్లను ధ్వంసం చేయడం.. కొండాపురం మండలం గానుగపెంటలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇంటి ప్రహరీ, మెట్లు కూల్చేయడం.. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న వారిని భయభ్రాంతులకు గురి చేయడం.. ఇకపై పోస్టులు ఆపేస్తామని వారితో ప్రకటనలు ఇప్పించడం.. తప్పుడు కేసులు పెట్టడం.. ఇలా ఒక్కో ఊళ్లో ఒక్కో అరాచకం కళ్లెదుటే కనిపిస్తోంది ఒక్క పోలీసులకు తప్ప అందరికీ.

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

డిప్యూటీ సీఎంగా పవన్!

- జనసేనకు మరో నాలుగు మంత్రి పదవులు
- కూర్పుపై కసరత్తు చేస్తున్న చంద్రబాబు



సాక్షి, అమరావతి: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ రాష్ట్ర మంత్రివర్గంలో చేరడం దాదాపు ఖరారైనట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉంటూనే ప్రధాన ప్రతిపక్షంగా సభలో అడుగు పెడతామని చెప్పడంతో పలు ఊహాగానాలు సాగాయి. అయితే తాజాగా పవన్ ప్రభుత్వంలో చేరాలని నిర్ణయించుకున్నట్లు జనసేన వర్గాలు తెలిపాయి. చంద్రబాబు, పవన్ మధ్య జరిగిన చర్చలో దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. పవన్ ఉప ముఖ్యమంత్రి హోదాలో పంచాయతీరాజ్ – గ్రామీణాభివృద్ధి శాఖలను నిర్వహిస్తారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తనతోపాటు జనసేన నుంచి గెలిచిన మరో నలుగురికి మంత్రి పదవులు ఇవ్వాలని పవన్ కోరగా చంద్రబాబు అందుకు సిద్ధమైనట్లు సమాచారం. ఇందులో ఒకటి నాదెండ్ల మనోహర్‌కి దక్కడం ఖాయమని చెబుతున్నారు. మిగిలిన పదవులకు కందుల దుర్గేష్, పంతం నానాజీ, అరణి శ్రీనివాసులు, వంశీకృష్ణ యాదవ్ పేర్లు వినిపిస్తున్నాయి.

నేడు టీడీపీ శాసన సభాపక్ష సమావేశం

టీడీపీ శాసనసభాపక్ష సమావేశం మంగళవారం జరగనుంది. సమావేశంలో చంద్రబాబును తమ నేతగా ఎన్నుకోనున్నారు. ఆ తర్వాత ఎన్డీఏ ఎమ్మెల్యేల సమావేశం జరగనుంది. దీనికి టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు హాజరు కానున్నారు.

ఉమ్మడి జిల్లాల వారీగా పదవులు

చంద్రబాబు ఉమ్మడి జిల్లాల వారీగానే మంత్రి పదవులు ఇస్తారని చెబుతున్నారు. ఒకరిద్దరు ఎమ్మెల్సీలను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది. నారా లోకేష్ మంత్రివర్గంలో చేరాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. మంత్రి పదవుల కోసం టీడీపీలో తీవ్ర పోటీ నెలకొంది. శ్రీకాకుళం జిల్లా నుంచి అచ్చెన్నాయుడు, గౌతు శిరీష, కూన రవికుమార్, కొండ్రు మురళి రేసులో ఉన్నారు. అయితే శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడికి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కినందున అచ్చెన్నాయుడికి ఇవ్వటంపై సందిగ్ధం నెలకొంది. విజయనగరం జిల్లా నుంచి కళా వెంకట్రావు, సంధ్యారాణి పేర్లు వినిపిస్తున్నాయి. విశాఖ జిల్లా నుంచి అయ్యన్న పాత్రుడు, గంటా శ్రీనివాసరావు, వంగలపూడి అనిత, పల్లా శ్రీనివాస్ పోటీ పడుతున్నారు. తూర్పు గోదావరి జిల్లా నుంచి జిల్లా నుంచి జ్యోతుల నెహ్రూ, నిమ్మకాయల చినరాజప్ప, యనమల రామకృష్ణుడు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి రేసులో ఉన్నారు. పశ్చిమ గోదా వరి జిల్లా నుంచి నిమ్మల రామానాయుడు, రఘురామకృష్ణరాజు, పితాని సత్యనారాయణ పేర్లు వినిపిస్తున్నాయి. కృష్ణా జిల్లా నుంచి బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, కొల్లు రవీంద్ర పేర్లను పరిశీలిస్తున్నారు. గుంటూరు జిల్లా నుంచి ధూళిపాళ్ల నరేంద్ర, నక్కా ఆనందబాబు, అనగాని సత్యప్రసా ద్, కన్నా లక్ష్మీనారాయణల్లో ఒకరిద్దరికి అవకాశం లభించనుంది. ప్రకాశం జిల్లా నుంచి గొట్టిపాటి రవికుమార్, దామచర్ల జనార్దన్, బాల వీరాంజనేయ స్వామి పోటీలో ఉన్నారు. నెల్లూరు జిల్లా నుంచి పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆశా వహుల జాబితాలో ఉన్నారు. చిత్తూరు జిల్లా నుంచి అమర్‌నాథ్‌రెడ్డి, కిశోర్ కుమార్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. అనంతపురం జిల్లా రేసులో పయ్యావుల కేశవ్, కాల్వ శ్రీనివాసులు, పరిటాల సునీత ఉన్నా రు. కడప జిల్లా నుంచి రెడ్డప్పగారి మాధవిరెడ్డి, పుట్టా సుధాకర్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు చెబుతున్నారు. కర్నూలు జిల్లాలో కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి, జయనాగేశ్వర్‌రెడ్డిలో ఒకరిద్దరికి చోటు దక్కవచ్చని ప్రచారం జరుగుతోంది.

నేడు రాయలసీమలో భారీ వర్షాలు!

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు స్థిరంగా కదులుతున్నాయి. గాలుల కోత, షీర్ జోన్ ప్రస్తుతం సముద్రమట్టానికి 3.1 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. మరోవైపు మరత్వాడా ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. వీటి ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులు అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. మంగళవారం రాయలసీమలో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. మంగళవారం అల్లూరి సీతారామరాజు, కృష్ణా, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో, బుధవారం నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వివరించింది. గురువారం బాపట్ల, కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఒకట్రెండు ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురవవచ్చని పేర్కొంది.


జిల్లా వార్తలు

రైతులకు శిక్షణ కేంద్రం ఏర్పాటుచేయాలి


ఎండీకి వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం బాధ్యులు

అశ్వారావుపేటరూరల్: ఆయిల్‌పామ్ సాగు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యాన ఆసక్తి ఉన్న రైతుల కోసం శిక్షణ ఇవ్వడంతోపాటు పరిశోధనల కోసం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిపామ్ గ్రోవర్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరి ఉమా మహేశ్వరరెడ్డి, కొక్కరపాటి పుల్లయ్య కోరారు. ఈ సందర్భంగా వారు సోమవారం హైదరాబాద్‌లో ఆయిల్‌ఫెడ్ ఎండీ కె.అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు అనుబంధంగా ఆయిల్‌ఫెడ్ ద్వారా పరిశోధన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే రైతులకు మేలు జరుగుతుందని చెప్పారు. అలాగే, ఇక్కడి ఫ్యాక్టరీలో ఆయిల్ రికవరీ లెక్కింపు కోసం టన్ను కెపాసిటీతో యూనిట్ ఏర్పాటు చేయాలని, రైతులకు నాణ్యమైన మొక్కలు అందించాలని కోరారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత తప్పనిసరి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఈ, అధికారులు

ఏన్కూరు: రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని క్వాలిటీ కంట్రోల్ విభాగం వరంగల్ రీజియన్ ఎస్‌ఈ వి.శ్రీనివాసులు సూచించారు. ఏన్కూరు మండలం బురదరాఘవాపురం నుండి పాపకొల్లు, జన్నారం నుండి తూతకలింగన్నపేట వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉపయోగిస్తున్న సామగ్రిని పరిశీలించిన ఎస్‌ఈ.. ఎక్కడ కూడా నాణ్యత లోపించకుండా పనులు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈలు సత్యనారాయణ, శశి, ఏఈ నాగేందర్ పాల్గొన్నారు.

సరికొత్తగా ఖమ్మం మార్కెట్

రూ.100 కోట్లతో వ్యవసాయ మార్కెట్‌కు హంగులు

- 2 లక్షల మిర్చి బస్తాలు వచ్చినా ఇక్కట్లు లేకుండా షెడ్లు
- 17 ఎకరాల విస్తీర్ణంలో 6 నుంచి 7 భారీ షెడ్ల నిర్మాణానికి కసరత్తు
- కార్యాలయం, షాపింగ్ కాంప్లెక్స్, ఇతర నిర్మాణాలకు సైతం ప్రణాళిక



ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ముఖద్వారం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ నూతన హంగులు సంతరించుకోనుంది. ఇప్పటికే రాష్ట్రంలో రెండో పెద్ద వ్యవసాయ మార్కెట్‌గా విరాజిల్లుతుండగా, దేశంలోనే ఓ మోడల్ మార్కెట్‌గా అధునాతనంగా తీర్చిదిద్దేందుకు రూ.100 కోట్లతో ప్రణాళికలు సిద్ధమయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లో మిర్చి కొనుగోళ్లకు గుంటూరు, వరంగల్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్లు పేరొందగా, వీటిలో ఖమ్మం మార్కెట్ తేజా రకం మిర్చి కొనుగోళ్లకు పేరుగాంచింది. విదేశాల్లో ఈ మిర్చికి అధిక డిమాండ్ ఉండగా, తెలుగు రాష్ట్రాల రైతులు ఇక్కడ పంట విక్రయించేందుకు ప్రాధాన్యమిస్తారు. గడిచిన ఐదారేళ్లుగా ఈ ప్రాధాన్యం మరింతగా పెరగగా, విదేశీ ఎగుమతిదారులు భారీగా కొనుగోళ్లు చేపడుతున్నారు. ఇక ఈ మిర్చి పంట ఆధారంగా జిల్లాలో 40 కోల్డ్ స్టోరేజీలను నిర్మించారు. పరిసర ప్రాంతాల్లో మిర్చి ఆయిల్ మిల్లులను ఏర్పాటు చేశారు.

తేజా మిర్చితో పెరుగుతున్న టర్నోవర్..

తేజా మిర్చి నుంచి వచ్చే ఆయిల్‌కు విదేశాల్లో డిమాండ్ ఎక్కువ. ఈ రకం మిర్చితోపాటు ఇతర పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాలతో ఖమ్మం మార్కెట్ ఏటా రూ.3 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తోంది. అయితే మార్కెట్‌లో తగిన సౌకర్యాలు లేకపోవడంతో సీజన్‌లో యార్డులు నిండి రైతులు మిర్చి బస్తాలను రహదారుల వెంట దింపుకుని విక్రయించుకునే పరిస్థితి నెలకొంది. భవిష్యత్‌లో మిర్చి సాగు ఇంకా పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో మార్కెట్‌ను ఆధునికీకరించేందుకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంకల్పించారు. మార్కెట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించేందుకు మార్కెటింగ్ అధికారులతో పలుమార్లు సమావేశమై చర్చించారు. మంత్రి ఆదేశాలతో మార్కెటింగ్ శాఖ ఇంజనీరింగ్ విభాగం, ఓ ప్రైవేటు ఆర్కిటెక్ట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నూతన సాంకేతిక విధానంతో కూడిన డిజైన్‌ను రూపొందించారు.

కార్యాలయం, దుకాణ సముదాయాలు కూడా..

షెడ్లతోపాటు మార్కెట్ కార్యాలయ పరిపాలనా విభాగం, చైర్మన్, సెక్రటరీ చాంబర్ల నిర్మాణాలతోపాటు వ్యాపారులకు, రైతులకు సౌకర్యవంతంగా దుకాణ సముదాయాల నిర్మాణాలకు కూడా డిజైన్‌లో స్థానం కల్పించారు. పంట విక్రయించిన రైతులకు పైకం అక్కడికక్కడే చెల్లించేలా దుకాణాల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు.

రైతుల విశ్రాంతి భవనం, బ్యాంకు వంటి నిర్మాణాలు

రైతులకు విశ్రాంతి భవనం, ఆర్థిక లావాదేవీల నిమిత్తం ఓ బ్యాంకు బ్రాంచి నిర్వహించేలా భవన నిర్మాణానికి కూడా డిజైన్‌లో స్థానం కల్పించినట్లు సమాచారం. ఫైర్ స్టేషన్, క్యాంటీన్ వంటి నిర్మాణాలను, రైతులతో పాటు మార్కెట్ వర్గాలకు సౌకర్యవంతంగా మరుగుదొడ్ల నిర్మాణాలకు కూడా డిజైన్ చేశారు. రానున్న పంటల విక్రయాల అన్ సీజన్‌లో నిర్మాణాలు చేపట్టాలని మార్కెటింగ్ శాఖ యోచిస్తోంది. అంతా పూర్తయితే దేశంలోనే మోడల్ మార్కెట్‌గా ఖమ్మం నిలవనుంది.

2 లక్షల మిర్చి బస్తాల క్రయ, విక్రయాలకు అనుగుణంగా..


మార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు (ఫైల్)

ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ప్రధానంగా రెండు విభాగాలుగా ఉంది. ఒకటి పత్తి యార్డు కాగా, మరొకటి మిర్చి, అపరాలు, మార్కెట్ పరిపాలనా విభాగం కార్యాలయం, చైర్మన్, సెక్రటరీ చాంబర్ల కార్యాలయాలతో ఉన్నాయి. వీటిలో 17 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మిర్చి, అపరాల యార్డులు, చైర్మన్, కార్యదర్శి చాంబర్ల కార్యాలయాల స్థానంలో రూ. 100కోట్ల వ్యయంతో 2 లక్షల మిర్చి బస్తాల క్రయ, విక్రయాలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందించారు. తూర్పు నుంచి పడమర దిశగా ఆరు నుంచి ఏడు షెడ్లను నిర్మించనున్నారు. ఒక్కో షెడ్డు 25 నుంచి 30 మీటర్ల వెడల్పుతో, 150 మీటర్ల పొడవు, 30 మీటర్ల ఎత్తుతో ఉండేలా డిజైన్ చేశారు. సోలార్ విధానంతో కూడిన రూఫ్‌తో రిఫ్లెక్టెడ్ లైటింగ్ ఉండే విధంగా నిర్మాణాలు ప్రణాళికలు రూపొందించారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్


గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న పీఓ ప్రతీక్‌జైన్

భద్రాచలంటౌన్: ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న గిరిజనుల్లో అర్హులందరికీ లబ్ధి జరిగేలా చర్యలు తీసుకుంటామని భద్రాచలం ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ తెలిపారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన వివిధ గ్రామాల గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. దరఖాస్తుల్లో తమ పరిధిలోనివి వెంటనే పరిష్కరించి, మిగతా వాటిని సంబంధిత అధికారులకు పంపిస్తామని చెప్పారు. కాగా, గిరిజనులు పోడు భూములకు పట్టాలు, జీవనోపాధి కోసం రుణాలు, గురుకుల కళాశాలల్లో సీట్లు, వ్యవసాయ భూములకు విద్యుత్ మోటార్లు తదితర అంశాలపై ఎక్కువ దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. బూర్గంపాడు మండలం ఇరవెండికి చెందిన వెంకటేష్‌తోపాటు మరో 12 మంది గిరిజనులు వారి గ్రామానికి విద్యుత్ స్తంభాలు వేయించి బోరు మోటార్లు ఇప్పించాలని, ఆళ్లపల్లి మండలం రామోజీగూడేనికి చెందిన 15 మంది గిరిజనులు వారి పొలాలకు త్రీఫేస్ విద్యుత్ లైన్ వేయించాలని కోరినట్లు వెల్లడించారు. అనంతరం యూనిట్ అధికారులతో సమావేశమైన పీఓ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం కానున్న దృష్ట్యా వాతావరణ మార్పులతో విద్యార్థులు ఇబ్బంది పడకుండా వార్డెన్లు, హెచ్‌ఎంలు పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఓ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఆర్‌సీఓ వెంకటేశ్వరరాజుతో పాటు వివిధ విభాగాల అధికారులు భాస్కర్, శ్రీనివాస్, మునీర్ పాషా, ప్రభాకర్‌రావు, ఆదినారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో ఉద్యోగోన్నతులు, బదిలీలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో పలువురు అధికారులకు ఉద్యోగోన్నతి కల్పించడమే కాక ఇంకొందరిని బదిలీ చేస్తూ యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు జీఎం ఎడ్యుకేషన్ నీలం వెంకటేశ్వరరావును కార్పొరేట్ కార్యాలయంలోని డైరెక్టర్ ఆపరేషన్స్ కార్యాలయంలో ఎస్‌ఓటూ డైరెక్టర్ ఆపరేషన్స్‌గా నియమించారు. అలాగే, సింగరేణి సూపర్‌బజార్ మేనేజింగ్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తూ అదనంగా జీఎం పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్జీగా ఉన్న సామ్యేల్ సుధాకర్‌ను పర్సనల్ వెల్ఫేర్ అండ్ ఆర్సీ జీఎంగా నియమిస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఇక ఎడ్యుకేషన్ సొసైటీ కరస్పాండెంట్ బెర్నాడెట్టే నికోలస్‌కు జీఎం ఎడ్యుకేషన్‌గా పదోన్నతి కల్పించారు. అలాగే, మైనింగ్, ఈ అండ్ ఎం, ఫైనాన్స్, పర్సనల్, ఎస్టేట్స్, లీగల్, మెడికల్, సర్వేతోపాటు మరికొన్ని విభాగాల్లో సుమారు 40 అధికారులకు పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

చిత్రకూట మండపంలో | మైక్ ఏర్పాటుకు రూ.1.55 లక్షలు


ఆలయ ఈఓ రమాదేవితో దాత కుటుంబసభ్యులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో చిత్రకూట మండపం వద్ద మైక్‌సెట్ ఏర్పాటుకు ఏపీకి చెందిన భక్తులు సోమవారం విరాళం అందజేశారు. శ్రీకాకుళంలోని భూపాలరావు కాలనీకి చెందిన పరిణం రామారావు –కృష్ణవేణి దంపతులు రూ.1.55 లక్షలను ఆలయ ఈఓ రమాదేవికి అందజేశారు. అనంతరం కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అధికారులు దాతలకు స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక అందజేశారు.


దాతకు రశీదు ఇస్తున్న ఆలయ ఉద్యోగులు

నిత్యాన్నదానానికి...

భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి సోమవారం ఓ భక్తురాలు విరాళం అందజేశారు. హైదరాబాద్ నగరంలోని బండ్లగూడకు చెందిన ఎస్పీ మంజుల రూ.50 వేల చెక్కు ఆలయ అధికారులకు అందజేసి కుటుంబ సభ్యులతో కలిసి స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం ఆమెకు అధికారులు స్వామివారి ప్రసాదంతోపాటు జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబీకులతో పాటు ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.